# తరాల మధ్య అంతరాలు

ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరంలో ఉండగానే కాంపస్ ఇంటర్వ్యూలో నాకు ఉద్యోగం వచ్చింది. వెంటనే వెళ్ళిపోవాలనిపించింది. ఎలా వెళ్ళగలను? యింకా చదువుందిగా, చదువు అయ్యే వరకూ నిమిషాలు, రోజులు లెక్క పెట్టుకుంటూండి పోయాను. లెక్క పెట్టడం పూర్తయింది. చెన్నై వెళ్ళిపోవాలి.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోరుకున్నవి. కాస్త అలస్యం అయినా దొరికాయి. అమ్మ దగ్గరికెళ్ళాను. టీవీ, పేపరు రెండూ ఒక్కసారే చూస్తోంది. "మనిద్దరికీ చెన్నైకి టిక్కెట్లు కొంటున్నాను."

ఆశ్చర్యంగా చూసింది.

"నేనుద్యోగంలో చేరాలి కదా, నాతో రావా!"

"నేనా! ఎలా 'వస్తాను?"

"ఎలా ఏంటి? రైల్లో అక్క పెళ్ళయిపోయింది. నా చదువయింది ఉద్యోగం వచ్చింది కదా! నాతో వచ్చెయ్యి."

"అదేంవిటీ అలా మాట్లాడుతున్నావు! నాన్నగారు..."

"నాన్నగారికి నువ్వు అక్కర్లేదు, నేనూ అక్కర్లేదు. మనకి ఆయన అక్కర్లేదు. ఆయనకీ మనం అక్కర్లేదు."

"తప్పు"

"తప్పూట తప్పు ఏంవిటమ్మ తప్పు? నువ్వే చెప్పు దీన్ని ఇల్లు అంటారా! ఓ జైలు కాదా! ఆయన దృష్టిలో మనం మనుషులమా! అన్నీ ఆయనకి నచ్చినట్లే జరగాలి. అలాగే నడవాలి. 'ఏం'? అని అడగకూడదు. ప్రతీ దానికి గొడవ. నోరు పెట్టుకుని రాజ్యం ఏలుతున్నారు. ఎక్కడైనా ఉంటుందామ్మా ఇలా... నువ్వే చెప్పు..."

నవ్వింది.

నాకదే కోపం, అమ్మకి అన్ని నవ్వులాటగానే ఉంటుంది.

"ఎప్పుడెళ్తున్నావు?" అంది. నేనన్నది పట్టించుకోకుండా.

" 'వ్వూ' కాదు 'మూ' " అన్నాను ఉక్రోషంగా,

మళ్ళా నవ్వింది.

"నువ్వు అంతా మీ నాన్నే... మంచి రోజు చూస్తాను... ఆ తెలుగు కాలెండర్ యిల్లా తీసుకురా."

"నిజం చెప్పు! నిజంగా నువ్వురావా?"

"ఏంవిటీ పంతం? అర్థం లేనిది." విసుక్కుంది.

"వొద్దమ్మా నువ్విక్కడ ఉండకు. నీ విలువ నాన్నగారికి తెలీదు. అసలు నువ్వు నాన్నగారితో సుఖపడింది ఏదైనా ఉందా? నాకు తెలీదా? నేను చూళ్ళేదా? ఎన్నిసార్లు ఏడవలేదు? ఎన్నిసార్లు అన్నం మానేయలేదు?"

ప్రశాంతంగా చూసింది.

"నేనొక్కటి చెప్తాను. నీకు, అమ్మ కష్టపడింది అని అనిపిస్తే, ఆ కష్టాలు నీ భార్యకి రానీకు. నాన్నగారి వల్ల నీకు బాధలు కలిగాయి అంటే, ఆ బాధలు నీ పిల్లలకి రానీకు."

"అదేంటమ్మా?"

"అదంతే, మనిషి ప్రవర్తనకి కారణం ఇంట్లోని వాతావరణం. నాన్నగారిది పెద్ద కుటుంబం సమిష్టి కుటుంబం సంపాదన తక్కువ యింటి నిండా మనుషులు. చదువులు, పుస్తకాలు ఓ వయసు వాళ్ళకయితే, పురుళ్ళు పుణ్యాలు మరో వయసు వాళ్ళకి ఇల్లుని ఒక్క త్రాటి మీద నడపాలంటే, యింటి పెద్దకి కోపం ఉండాల్సిందే నియమాలుండాల్సిందే అలాంటప్పుడు ప్రేమ, ఆప్యాయతలకి స్థలం ఎందుకుంటుంది? ఆ వాతావరణంలో పెరిగినప్పుడు అందరికీ అదే వస్తాయి.

నీ అదృష్టం నువ్వొక్కడివే, అరకిలో బంగాళదుంపలు వేయిస్తే, అంతా నువ్వే తినేసినా దెబ్బలాడే వాళ్ళు లేరు. కానీ, మీ నాన్నగారి చిన్నప్పుడు రెండు కిలోలు దుంపలు వేయించినా, అందరికి ఒకటేసారి వెయ్యడం. మారు అన్న మాటే ఉండదు. మంచిగా, ప్రేమగా మాట్లాడడం, నవ్వుతూ హాయి అయిన వాతావరణం అన్నదే లేని ఇంట్లోంచి వచ్చినప్పుడు అలాగే ఉంటారు. అది వాళ్ళు తప్పు కాదు. వాళ్ళ పరిస్థితి అలాంటిది.

ఒరేయ్। నువ్వు మీ నాన్నగారు పెరిగినట్లు పెరగలేదు. నువ్వు నీ భార్యని బాగాచూసుకో. నీ పిల్లల్ని చాలా మంచిగా ఓపిగ్గా పెంచు."

"అవన్నీ తర్వాత... చెప్పు... ఏ రోజున వెళ్దాం?""

"సరే ఎన్ని రోజులకి రాను? రిటర్న్ టికెట్ కూడా కొనేస్తే..."

"ఎన్ని రోజులేంటి? ఎప్పటికీ నువ్వు నాతోనే ఉండాలి. ఎప్పటికీ నువ్వు సంతోషంగా ఉండేలా చేస్తాను. బోల్డు బంగారం, నువ్వు కోరుకునే మెడ్రాస్ పట్టుచీరలు ఎన్నో కొంటాను." గర్వంగా అన్నాను.

పక్కున నవ్వింది.

"చిన్న పిల్లనా, అన్నీ ఆశలు పెట్టావు? ఆశచూపిస్తే ఎప్పటికీ నీతో ఉంటాననా?"

"విషయం చాలా సీరియస్‌ది. గుర్తుంచుకో"?

నా మొహంలోకి చూసింది.

"నాన్నగార్ని వదిలేసి, నీతో వచ్చేయమంటావు. అదే కదా? నువ్వనేది." తడబడ్డాను.

"సరే... మనిద్దరం గుర్తు పెట్టుకోవాల్సింది కొన్ని ఉన్నాయి. ఒక్కసారి ఈ ఇల్లు దాటానంటే, మళ్ళా ఈ ఇంట్లోకి నేను వచ్చే పరిస్థితి రాకూడదు. నిన్ను నమ్మి నీతో వచ్చేస్తే నేను బతికినన్నాళ్ళు నీ ఇంట్లోనే ఉండాలి. కానీ, ఇక్కడ నువ్వొకటి గుర్తుంచుకోవాలి, నీకూ పెళ్ళవుతుంది. పిల్లలు పుడ్తారు నువ్వునా మీద చూపే ప్రేమ, నాకు నువ్విచ్చే గౌరవం నా మీద సానుభూతితో కావచ్చు.

మనం ఒకే లాంటి సఫరింగ్స్‌ని ఎదుర్కొన్న వాళ్ళం అనేది కూడా కావచ్చు. నీ వాళ్ళకి ఇలాంటి భావాలు నా మీద ఉండాలన్న రూలేం లేదు కదా? ఒక్కోసారి, నువ్వు కొన్ని ఇబ్బంది కరమైన పరిస్థితుల్లో నీ భార్య వైపు మొగ్గవచ్చు. అది నా అభిమానం మీద దెబ్బతియవచ్చు మీది, నాది అన్న భావం నీ భార్యలో రావచ్చు. డబ్బు చేతిలో లేకపోతే నేను ఇబ్బంది పడవచ్చు. ఒక్కోసారి ఒక్క రూపాయి కోసం కక్కుర్తి పడచ్చు."

నేను ఇది ఊహించనిది మౌనంగా ఉండిపోయాను.

మళ్ళీ అమ్మే అంది.

"నీకు ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ, నువ్వు చేసినదే - ఇదే... మీ నాన్నగారు చేస్తారు. నువ్వు మరో నాన్నగారిలాగా అవడానికి ఇవన్నీ మెట్లు. మీ యిద్దరిలో వయసులో తేడా ఉన్నా ఇద్దరి ప్రవర్తనలో పెద్ద తేడా లేదు. నీకున్న పరిధిలో నువ్వు ఓరకంగా గొడవ పెడ్తే... మీ నాన్నగారు అధికారంతో ఉన్న పరిధిలో మరోరకమైన గొడవలు... నువ్వు మీ నాన్నగార్ని నా ముందు విమర్శిస్తూంటే, మీ నాన్నగారు నీ గురించి నా దగ్గరంటారు. తేడా ఏం లేదు. నిన్ను క్షమించేస్తున్నాను. అలాగే మీ నాన్నగార్ని క్షమించేస్తున్నాను...

నీకు తెలీకుండానే, నీలో కొన్ని భావాలు, మాటలు, ప్రవర్తన మీ నాన్నగారిది వచ్చేసింది...

మీ ఇద్దరి దగ్గరా నా స్వాతంత్ర్యం ఎలా ఉందో నేను చెప్తాను. నా మనసులోని భావాలు, ఆలోచనలు, ఏవైనా కామెంట్స్ నీ కన్నా ఎక్కువ స్వతంత్రంగా మీ నాన్నగారితోనే చెప్పగలగుతాను.

నిన్ను ఓ రూపాయి అడగడానికైనా ఓ అడుగు వెనక్కి వేస్తానేమో కానీ, మీ నాన్నగారిని వెయ్యి రూపాయలు అడగడానికి సంకోచించను. నేను ఓ రోజున పడుకుంటే కాఫీ మీ నాన్నగారు తెచ్చినంత త్వరగా మీ అక్కా తమ్ముళ్ళు తేలేరు. ఇది ఇప్పుడు అప్రస్తుతం అనుకో ఆలోచనలు మన వరకే. ప్రవర్తన

మన చుట్టూ ఉన్న వాళ్ళ కోసం అందుకని మనల్ని చాలా మంది గమనిస్తున్నారని గుర్తుపెట్టుకోవాలి. అప్పుడు మనమీద అభిప్రాయాలు వాళ్ళకి మంచివి ఏర్పడతాయి.

ఓ మంచి మొగుడిగా, ఓ మంచి నాన్నగా ఉండాలంటే ఎదుటివాళ్ళు మారాలని అనుకోకు. ముందు నువ్వు మారు. మీ నాన్నగారిలో ఉన్న తప్పులు నీలో ఉండకుండా ఉండేందుకే ప్రయత్నం చెయ్యి ఓ మంచి నాన్న ఎలా ఉంటారో నీ పిల్లల దగ్గర చూపించు. తరాల మార్తున్నప్పుడు ప్రవర్తనలో మార్పురావాలి. అప్పుడే ఎవల్యూషన్ జరుగుతోందని అర్థం. భావాలు మారాలి. నాన్నరికం పెద్దరికాన్ని మర్చిపోవాలి. మీ నాన్నగారిలో నీకు కనిపించిన తప్పులు నీలో నీ పిల్లలకి కనపడనివ్వకు. మనందరం మనుషులం బలహీనతలుంటాయి. అయితే డిగ్రీల్లో తేడా ఉండవచ్చు. క్షమించడం నేర్చుకో, నీకు పీస్ కావాలని అనుకుంటే..."

"అయితే నువ్వు రానంటావు... నీ ఇష్టం..."

ఓ మంచి రోజు కాలెండర్‌లో చూసుకుని చెన్నైకి వెళ్ళిపోయాను.

ఆ తర్వాత దేవసేనతో నా పెళ్ళి అయిపోయింది. పిల్లలు పుట్టారు. నాకు నాకు నాన్నగారికి మధ్య దూరం పెరగలేదు. తరగలేదు. దూరం తగ్గించడానికి ఇద్దరం ప్రయత్నించలేదు.

ఆ తర్వాత నాలుగు కంపెనీలు మారి, అఖరికి గుర్‌గాంవ్‌కొచ్చాను. పిల్లలు, దేవసేన నెల్లూరు వెళ్ళేవారు. కానీ, నేనేనాడు మా ఇంటికెళ్ళలేదు.

"తల్లిదండ్రుల్ని చూడాలని వాడికుండాలి. కొడుక్కుండాల్సినవి కొన్ని ఉంటాయి. అందులో తల్లి దండ్రుల్ని చూడాల్సిన ధర్మాన్ని నిర్వర్తించడం, చెప్పి చేయించుకోవాల్సిన పనిలేదు. ఆ స్థితి వచ్చిందంటే అది ఖచ్చితంగా మా పెంపకంలోని లోపం" అని అమ్మ అందిట.

నాన్నగారు రిటైరయ్యాకా, ఓసారి ఇంటికి వెళ్ళాల్సి వచ్చింది. ఆయన దగ్గర నుంచుని మాట్లాడలేకపోయాను. ఆయన ముందు గదిలో ఉంటే, నేను

మరో గదిలో ఉండిపోయాను.

ఎక్కడో మూలల్లోంచి అనిపిస్తోంది. ఇది సహజంగా లేదని, అందరిళ్ళల్లో యింతేనా, మా ఇంట్లోనేనా?

మా మధ్య ఎందుకింత దూరం! అప్పుడంతా చిన్నతనం. భయం ఉండేది. ఇప్పుడు పెద్దగా అయ్యాను అయినా ఏమిటిది? భయమా! భక్తా! చిన్నప్పట్నించి ఆయన నాతో మంచిగా ఉండి ఉంటే నాకు ఆయన మీద మంచి అభిప్రాయం ఉండేదా! ఈ రోజున మధ్యలో రమ్మంటే ఎక్కడ్నించి వస్తుంది! అభిప్రాయాలు మారడం లేదు.- ఇదీ కారణం కావచ్చు మా ఇద్దరి మధ్యా దూరం తరగాలంటే నా వైపునుంచి నేనే ప్రయత్నం చెయ్యాలా! ఆయన ప్రయత్నం ఏం ఉండదా! స్కూల్లో చదువుకునే రోజుల్లో ఏం పెద్దగా తెలీదు. ఏదో అప్పట్లో ఏర్పడ్డ అభిప్రాయాలు.

ఆ అభిప్రాయాలు మారలేదు. ఇంటర్‌లో ఉన్నప్పుడు, అస్తమానం చదువు, రాంక్, కాలేజి, ఫీజ్, చదువు ఊపిరి పీల్చనివ్వకుండా చంపేస్తే యింక మంచి అభిప్రాయం ఎలా ఏర్పడుతుంది!

కానీ, అది ఎప్పుడో... ఆ రోజులు... ఆ పరిస్థితులు వేరు. మరి ఇప్పుడు... నాకు తెలీకుండానే నేను నాన్నగారిలా అయిపోతున్నానేమో అని అనిపిస్తోంది... మరి నాకొడుకో... నా లాగా అయిపోతాడా! నాన్న గుణాలు నాలో వచ్చేస్తున్నాయా!

ఆ తర్వాత నుంచి నన్ను, నాన్నగార్ని పక్క పక్కఉంచుకొని రోజూ ఎనలైజ్ చెయ్యడం మొదలు పెట్టాను.

నాన్నగారు తప్పుచేశారు? అన్న స్థాయినుంచి నాన్నగారేం తప్పు చేశారు? అనే స్థితికొచ్చాను.

అవేం తప్పులు కావే? ఓ తండ్రిగా ఆయన భయం, ఆందోళన. అమ్మ అన్నట్లు నాన్నగారికి వ్యక్తీకరించడానికి భయం. నా కొడుకంటే నాకిష్టం... అని చెప్పడానికి జంకు.

ఇంట్లో ఒక్కోసారి, చిన్న చిన్న విషయాలకి కోపం తెచ్చుకునేవాణ్ణి. ఇదే తప్పు నాన్నగారు చేస్తే అమ్మ దగ్గర క్రిటిసైజ్ చేసేవాణ్ణి. ఎందుకుని? నేను మరో నాన్నని అయిపోతున్నాను.

నేను మామూలు మొగుణ్ణి అయిపోతున్నాను. మరో నాన్నని అయిపోతున్నాను. నాన్నగారి కోపం నాలో నాకు తెలీకుండానే వచ్చేస్తోంది. వివక్షత పోతోందనిపిస్తోంది. మారడానికి ప్రయత్నిస్తున్నాను.

మా క్రిందున్న ఫ్లాట్‌లో ఉండే డోగ్రా కొడుకు పెళ్ళి లుధియానాలో జరుగుతూంటే దేవసేన కూడా పిల్లల్ని తీసుకుని వెళ్ళింది. వస్తూ వస్తూ మరూన్ రంగు పుల్లోవర్ నా కోసం తెచ్చింది.

అదే రోజున నేను గిలోత్ర యింటికి పార్టీకెళ్ళాల్సి ఉంది. పిల్లలు రాకూడదు. దేవసేన పెళ్ళి, ప్రయాణంతో అలిసిపోయి రానంది. నేనొక్కణ్ణి పార్టీకి వెళ్ళాలి. జీన్స్ పాంట్, షర్ట్, కొత్త స్వెటర్ తీసి ఓ పక్కగా పెట్టుకున్నాను.

గిలోత్ర ఇల్లు లాజ్‌పత్ నగర్, ఎంత లేదన్నా గంటన్నర ప్రయాణం.

పిల్లలకి చెప్పలేదు నా పార్టీగురించి, నేను వెళ్ళడం గురించి, తెలిస్తే గొడవ ఎలాగూ అవుతుంది. అంత దానికి పొద్దున్నుంచి గొడవ ఎందుకు? సాయంత్రం చెప్తే వాళ్ళ గొడవ వాళ్ళకి, నా పార్టీ నాకు. అని అనుకుంటూ ఆఫీసుకు వెళ్ళిపోయాను.

సాయంత్రం ఇంటికి వచ్చేముందు మేక్ డోనాల్డ్స్‌లో రెండు పిజాలు, రెండు బర్గర్‌లు, ఓ కోక్ పిల్లలకోసం తెచ్చాను. యింట్లో పిల్లలు లేరు. పెద్దవాడు కోచింగ్, రెండోవాడు క్రికెట్‌కి వెళ్ళి ఉంటారు.

ఎక్కడ పార్టీకెళ్ళినా ఇద్దరూ గొడవ పెట్టేస్తారు. ఎప్పుడూ మీరే వెళ్తుంటారు. మంచి మంచివి తినేసి వస్తారు. అయితే ప్రతిసారీ 'ఇది పెద్దవాళ్ళ పార్టీ కాబట్టి పిల్లలు రాకూడదు' అని చెప్పడానికి ఎంతో టైము పట్టేది. ఏవో బర్త్‌డే పార్టీలు అవుతూనే ఉంటాయి. వీటికి వెళ్తూనే ఉంటారు. అయినా

మేము వెళ్తుంటే మటుకు ఎప్పుడూ పార్టీ మొహం చూడనట్లే గొడవ పెట్టేస్తారు. దేవసేన కలగచేసుకోవడం, తిట్టడం, వీలయితే నాలుగు తగిలించడం, ఏడవడం, ఉంటాయి. ఎక్కడైనా పార్టీ ఉందన్న రోజున -

ఇలాంటి సీను, ఎపిసోడ్ రాకుండానే ముందే వాళ్ళకి ఇష్టం అయిన, దహీ బల్లా, ఏదో ఛాట్ లేకపోతే బర్గర్ తీసుకుని వెళ్తాను. వాళ్ళూ హేప్పీ నేనూ హేప్పీ...

స్నానం చేసి తయారయ్యాను.

కొత్త స్వెటరుంది కదా అని కోటు తీసి ఉంచుకోలేదు. తయారయ్యాకా స్వెటర్ కోసం వెదికాను కనపళ్ళేదు. ఏంవయిందీ?

దేవసేనని అడిగాను.

"పొద్దున్న మీకే ఇచ్చాను కదా!"

"పొద్దున్న ఇచ్చావు కానీ, నేను దాన్ని ఇక్కడే పెట్టి వెళ్ళి పోయాను." ఇద్దరం కలిసి వెతికాం. అదేం చిన్న వస్తువు కాదు.

నాకు చచ్చేంత కోపం వచ్చింది.

పెట్టిన వస్తువు పెట్టిన చోట ఉంచనివ్వని ఇంట్లో వాళ్ళమీద, విసుగు, చిరాకు, కోపం అన్నీ ఒక్కసారిగా వచ్చాయి.

పొద్దుట్నుంచి అనుకున్న డ్రెస్, స్వెటర్ అది, ఉంది కదా అన వేరేది చూసుకోలేదు.

నాకు డ్రెస్ సెన్స్ చాలా ఎక్కువ. ఎక్కడికెళ్ళినా పెర్ఫెక్ట్‌గా డ్రెస్ చేసుకుని వెళ్తాను. ఉన్న స్వెటర్‌లల్లో మాచింగ్ కోసం వెతికాను. దొరికింది. నేను వేసుకున్న జీన్స్‌కి సరిపోయే ఆలివ్ గ్రీన్ మీద తెల్ల డైమండ్‌లున్న డిజైనున్న పుల్లోవర్ వేసుకున్నాను. ఆ స్వెటర్ క్రిందటి పార్టీలో వేసుకున్నాను. అందరూ గమనిస్తారా? అని ఆలోచిస్తూనే బూట్లు వేసుకుని గ్లోవ్స్, కారు తాళం చేతులు తీసుకుని ముందు గదిలోకి వచ్చాను.

తలుపు తీద్దామని తలుపుకున్న హేండిల్ పట్టుకున్నాను. నా వెనకాలే వచ్చింది. దేవసేన అదే టైములో తలుపు తీసుకుని, పాట పాడుకుంటూ లోపలికి రాబోతున్న నా పుత్రరత్నం నన్ను గుమ్మం దగ్గరే చూసి ఆగిపోయాడు. బిత్తర చూపులు చూడ్డం మొదలెట్టాడు.

నా కొత్త స్వెటర్, వాడి జీన్స్ మీద ఒదిగి ఉంది. ఒక్కసారి దేవసేన నన్ను వెనక్కి తోసి తాను ముందు కొచ్చింది.

"అమ్మ! నాయనా! ఇది నువ్వు వేసుకెళ్ళావా! దీనికోసం ఇల్లూ ఊరూ వాడా అంత గాలించాం నేనూ మీ పప్పా! దా నాయనా రామ్మా! ఆ గదిలోకి రా! రెండు వేస్తా! గట్టిగా అరవకుండా ఉండాలి ఏం!" అంటూ దేవసేన వాడి చేయిని లాగింది.

నాకు నషాళానికంటిన కోపం దిగలేదు. అలాగే వాడినిచూస్తుండిపోయాను. కొట్టలనిపించింది. కానీ... ఆగిపోయాను.

గబుక్కున ఏవో దృశ్యాలు నా కళ్ళముందు కదలాడాయి.

ఆ రోజున.....

నాన్నగారు కొత్త సాండిల్స్ తెచ్చుకున్నారు. సాయంత్రం లెక్కలు, ఫిజిక్స్ కోచింగ్ కోసం వెళ్తు ఎదురుగా ఉన్న కొత్త సాండిల్స్ వేసుకుని గొప్పగా, గర్వంగా, ఠీవిగా వెళ్ళిపోయాను.

రాత్రి ఎనిమిదిన్నరకి నేను ట్యూషన్ నుంచి వచ్చేసరికి ఇంట్లో నాన్నగారు నరసింహావతారంలో ఉన్నారు. ఆ రోజున ఆయన కొట్టిన దెబ్బలకి మూడు రోజులు స్కూలు మొహం చూళ్ళేదు. మనసులోని అవమానం కరగడానికి మూడు రోజులు పట్టింది.

అది అప్పుడు.....

మరి ఇప్పుడు......

ఈ రోజున నేను అదే తప్పు చెయ్యబోతున్నానా? నాన్నగారికి నాకు

ఉన్న దూరం నాకూ నా కొడుకుకి మధ్య రాబోతుందా!

అదే పరిస్థితి కానీ, పాత్రలు వేరు.

నేను నాన్నగారి పాత్రలో

నా పాత్రలో నా కొడుకు.

ఆ రోజున నా వయసు పదిహేను సంవత్సరాలు.

ఈ రోజున నా కొడుకు వయసు పద్నాలుగు.

అప్పటికి, ఇప్పటికి తేడా ఏం లేదా!

ఆ రోజున నాన్నగారిలో ఉన్న కోపం, ఈ రోజున నాలో కూడా వచ్చేసింది. ఇది జీన్స్! నాకు తెలీకుండా నేను మరో నాన్నలా మారిపోతున్నాను.

తరం తర్వాత తరం. అవే భావాలు, అదే ప్రవర్తన, ఇదేంవిటిదీ? ఇది పెద్దరికమా? నాది అన్నది వాడు వేసుకున్నాడన్న అసూయా? ఈర్ష్య? ఇప్పుడు నా ప్రవర్తనకి అదే పదం వర్తిస్తుందా?

ఈ తరతరాల అంతరం, అధిక్యభావం ఎక్కడో అక్కడ ఆగాలి, ఎక్కడ?

ఈ తండ్రి కొడుకుల మధ్య నున్న గీత పెరిగి వెడల్పయిపోయి అగాధాల్లా మారకుండానే చెరిపేయాలి.

అంతస్థుని కూలదోసెయ్యాలి.

చరిత్ర పునరావృతం కారాదు. కాకూడదు నాకిష్టంలేదు. ఇప్పుడిప్పుడే యవ్వనంలోకి అడుగు పెడ్తున్న నా కొడుకు తిరిగి నాలాగా, అసంతృప్తితో, అటూ ఇటూ తిరిగటం జరిగితే మరో నేనులా.....

అక్కడే ఉన్న సింగిల్ సోఫోలో కూచుని తల నొంచుకుని భయంగా మధ్య మధ్యలో నన్ను చూస్తున్నాడు.

నాడి మొహంలోకి చూశాను.

నా చిన్నప్పటి భావాలే, అలాంటివే వాడి ముఖంలో.

వాడి దగ్గరగా వెళ్ళాను.

నా ముఖంలోకి ఓసారి చూసి, సోఫోలోనే వెనక్కి జరిగాడు. కొడ్తనేమోనన్న భయంతో చిరు నవ్వు నవ్వాను.

రెండు నిమిషాల తర్వాత వాడి కళ్ళల్లో భయం తగ్గింది.

"నా అంత పొడుగైపోయావు. నీకు బావుంది. నీకే అది, నువ్వే ఉంచుకో."

వాడి కళ్ళల్లో ఆశ్చర్యం.

అలా అంటున్నప్పుడు నాకు నేనే ఏదో మహర్షిలా అనిపించాను. కొడుకు మీద జెలసీ లాంటి ఫీలింగ్ రాలేదు. ఓ మెచ్యూర్డ్ ఫీలింగ్ ఓ తండ్రికి ఉండాల్సిన పెద్దరికం.

వాడి భుజం తట్టాను.

"మా ఫ్రెండ్స్ కూడా అదే అన్నారు." అంటూ సంతోషం వ్యక్తం చేశాడు.

"మీకు పిజాలు, బర్గర్‌లు తెచ్చాను. బ్లాక్ ఫారెస్ట్ కూడా" అంటూ బయటకి అడుగు పెట్టాను. ఓ మంచి తండ్రిలాగ ప్రవర్తించినట్లనిపించింది.

(బాపు ఆగష్టు 2005)

కథా ... శ్రీకాకుళం